# ‘సోషల్’ బానిసలుగా విద్యార్థులు



## ముదిరిపోయిన సెల్‌ఫోన్ వ్యసనం

**82% మంది సోషల్ మీడియాకే అంకితం • 34% మంది వద్ద సొంత స్మార్ట్‌ఫోన్లు**

**విద్యకు వినియోగించేవారు తక్కువే • ఏఎస్ఈఆర్ నివేదికలో చేదు నిజాలు**

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వ్యసనం ముదిరిపోయింది. వారిలో చాలా మంది సోషల్ మీడియా మోజులో చిక్కుకుపోయారు. 14-16 ఏండ్ల మధ్య వయస్కుల్లో ఏకంగా 82% మంది తమ స్మార్ట్‌ఫోన్లను సోషల్ మీడియా కోసమే ఉపయోగిస్తున్నారు. వయసులవారీగా చూస్తే.. 14 ఏండ్ల వయస్సుల్లో 79% మంది, 15 ఏండ్ల వయస్కుల్లో 82.2% మంది, 16 ఏండ్ల వయస్కుల్లో 82.5% మంది సోషల్ మీడియాలో మునిగిపోతున్నట్టు వార్షిక విద్యాస్థాయి నివేదిక (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) వెల్లడించింది. 14-16 ఏండ్ల వయస్కులు విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు స్మార్ట్‌ఫోన్లను అంతంత మాత్రంగానే ఉపయోగిస్తున్నట్టు ఈ నివేదిక తేల్చింది.

**బాలురే స్మార్ట్**

- బాలికలతో పోల్చితే బాలురే అధికంగా స్మార్ట్‌ఫోన్లను, సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నట్టు ఏఎస్ఈఆర్ వెల్లడించింది.
- రాష్ట్రంలోని 96% మంది విద్యార్థుల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. 97% మంది బాలురు, 94%మంది బాలికల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నట్టు తేలింది.
- సామాజిక మాధ్యమాల నుంచి రక్షణ పొందే విషయమై విద్యార్థులకు అవగాహన బాగానే ఉన్నది. ఖాతాను బ్లాక్ చేయడంపై 67.2% మంది, పాస్‌వర్డ్ మార్చడం 62% మంది, ప్రొఫైల్‌ను గోప్యంగా ఉంచుకోవడంపై 60.8% మంది విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నారు.
- చదువు కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్న విద్యార్థులు 61.1% మందే. బాలురలో 60.7%, బాలికల్లో 61.5% మంది చదువుల కోసం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు.
- విద్యార్థుల్లో 34.3% మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. బాలురలో 39% మంది, బాలికల్లో 29% మంది సొంత స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు.
- వయసులవారీగా చూస్తే.. 16 వయస్కుల్లో 46.3%, 15 ఏండ్ల వయస్కుల్లో 29%, 14 ఏండ్ల వయస్కుల్లో 31.11% మంది స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు.
- విద్యార్థుల్లో 88.6% మంది యూట్యూబ్‌లో వీడియోలను వీక్షించేందుకు, 89% మంది అలారమ్ కోసం, 84.4% మంది సమాచార సేకరణ కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్నట్టు చెప్పారు.

## మంచినీటి బావిలో వేడినీళ్లు

*దండేపల్లి, జనవరి 29 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మాదాపూర్‌లో ఆవునూరి మధుకర్‌కు సంబంధించిన మంచినీటి బావిలో నీళ్లు పొగలు కక్కుతున్నాయి. చుట్టుపక్కల బావులలో చల్లగా ఉంటున్నప్పటికీ ఈ బావిలో వేడి నీళ్లు రావడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐదారు రోజులుగా ఇలాగే రావడంతో బావికి ఉన్న విద్యుత్ మోటర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అయినప్పటికీ పొగలు కక్కుతూ వేడినీరు వస్తున్నది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ అస్మితను వివరణ కోరగా ఆ నీటి శాంపిల్స్ మంచిర్యాల కార్యాలయానికి పంపినట్టు తెలిపారు.*

# ‘కగార్’ను తక్షణమే నిలిపివేయాలి

- **ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**
- **న్యాయస్థానాలు సుమోటోగా విచారణ చేయాలి**
- **ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే**
- **కగార్‌పై నిర్వహించిన సదస్సులో మేధావులు, వక్తలు**



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కూనంనేని, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్ సీపీఐ నాయకురాలు పశ్యపద్మ తదితరులు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో కొనసాగిస్తున్న ‘ఆపరేషన్ కగార్’ను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్ష నాయకులతోపాటు పలువురు మేధావులు డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ‘నక్సల్స్ పట్ల కేంద్రప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం.. ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం’ అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కే నాగేశ్వర్, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్, వామపక్షాల నాయకులు డీజీ నరసింహారావు, చలపతి రావు, మురహరి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయని.. మాట్లాడినా, ప్రశ్నించినా అణచివేస్తున్నారని, నిర్బంధ వాతావరణం నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. బస్తర్ ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తామని, అడ్డొస్తే చెట్లతోపాటు మనుషులను కూడా తొలగిస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం మాట్లాడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాజ్యం చట్టబద్ధమైన హద్దులు దాటి బలప్రయోగ శక్తి వంద రెట్లు పెరిగిందని తెలిపారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మావోయిస్టుల తరపున గొంతును వినిపిస్తామని స్పష్టం చేశారు. నక్సల్స్ పేరుతో ప్రజలను, ప్రశ్నించే వారిని చంపితే ఊరుకోబోమని హెచ్చరించారు. మావోయిస్టులు ప్రజల కోసం అడవిలో పనిచేస్తుంటే.. అమిత్ షా మాత్రం పెట్టుబడిదారుల కోసం ప్రజల మధ్య ఉంటూ ప్రజలనే చంపిస్తున్నారని ఆరోపించారు. 2026 మార్చి నాటికి దేశంలో ఒక్క మావోయిస్టు కూడా లేకుండా చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విప్లవ కళాకారులు, సమాజాన్ని ప్రశ్నించే ప్రతిఒక్కరూ కమ్యూనిస్టులేనని శ్రీశ్రీ, దాశరథి లాంటివారు చెప్పారని గుర్తుచేశారు.

## నాయనమ్మ కండ్లలో ఆనందం కోసమే హత్య

సూర్యాపేట, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో కలకలం రేపిన కులోన్మాద హత్యలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నాయనమ్మ కండ్లలో ఆనందం కోసమే మనుమండ్లు ప్రేమ పెండ్లి చేసుకున్న సోదరి భర్త కృష్ణను అతి కిరాతకంగా హత్య చేసినట్టు తేలింది. ఆ తరువాత కారులో శవాన్ని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాయనమ్మ దగ్గరికి తీసుకెళ్లి చూపించి ఆమె కండ్లల్లో ఆనందం చూసినట్టు నిందితులు చెప్పడం విస్మయానికి గురిచేస్తున్నది. సూర్యాపేట పట్టణంలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ (32) అదే పట్టణంలోని పిల్లలమర్రికి చెందిన భార్గవి ప్రేమించుకున్నారు. కృష్ణది ఎస్సీ సామాజిక వర్గం కాగా, భార్గవి బీసీ. వీరి పెండ్లికి భార్గవి కుటుంబం ఒప్పుకోలేదు. ఆరు నెలల క్రితం వీరిద్దరు పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. దీంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణపై పగ పెంచుకున్నారు. ప్రధానంగా భార్గవి నాయనమ్మ కోట్ల బుచ్చమ్మ తన మనుమరాలు వద్దన్నా పెండ్లి చేసుకోవడంతో తరచూ మనుమండ్లను ఎగతాళి చేస్తూ మాట్లాడేది. వాడిని చంపితేనే మీరు సరైన మగాళ్లురా అంటూ వారిని ఉసి గొలిపేది. దీంతో భార్గవి సోదరులు కోట్ల నవీన్, వంశీ మరింత పగ పెంచుకొని కృష్ణను అంతమొందించాలని పథకం పన్నారు. స్నేహితుడైన బైరు మహేశ్ సహాయం తీసుకున్నారు. ఈ నెల 26న సాయంత్రం కృష్ణ తన స్కూటీపై మహేశ్ ఇంటికి రాగా ఇద్దరు కలిసి పిల్లలమర్రి శివారుకు వెళ్లి మందు తాగారు. మహేశ్ మద్యం తాగగా.. కృష్ణ కూల్‌డ్రింక్ మాత్రమే తీసుకున్నట్టు తెలిసింది. కొద్దిసేపటి తరువాత మహేశ్ పక్కకు వెళ్లి నవీన్, వంశీకి ఫోన్ చేసి రమ్మన్నాడు. ఇంటికి వెళ్దామని కృష్ణ స్కూటీ తీస్తుండగా మహేశ్ వెనుక కూర్చొని కృష్ణ గొంతుకు అడ్డంగా చేయి వేసి గట్టిగా నొక్కుతుండగా నవీన్, వంశీ పరుగెత్తుకొని వచ్చి రాళ్లతో కొట్టి హత్య చేశారు. హత్యానంతరం నవీన్ తన కారు డిక్కీలో కృష్ణ శవాన్ని ఉంచాడు. పాత సూర్యాపేటలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌లో ఉన్న వాళ్ల నాయనమ్మ దగ్గరికి తీసుకెళ్లి శవాన్ని చూపించారు.

## 12,500 లంచం తీసుకుంటూ..

**ఏసీబీకి చిక్కిన లింగంపేట ఎస్సై**

వినాయక్‌నగర్, జనవరి 29: నిజామాబాద్ మండలం బోర్గాం(పీ) వద్ద ఉన్న కార్ బజార్ నిర్వాహకుడు స్వామి చిరంజీవి అనే వ్యక్తికి కారును విక్రయించాడు. చిరంజీవి లోన్ డబ్బులు చెల్లించకపోవడంతో మొదటి యజమాని రాజేశ్‌కు నోటీసులు వచ్చాయి. దీంతో అతడు లింగంపేట ఎస్సై సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఎస్సై కార్‌బజార్ నిర్వాహకుడికి ఫోన్ చేసి కేసు నమోదుకాకుండా ఉండడానికి 30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో అతడు 12,500 ఇస్తానంటూ ఒప్పందం కుదుర్చుకొని, ఏసీబీని ఆశ్రయించారు. స్వామి ఎస్సైకి 12,500 ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## సహోద్యోగి నుంచి 15 వేలు లంచం

**ఏసీబీకి చిక్కిన పశు వైద్యాధికారి**

ఉట్నూర్ రూరల్, జనవరి 29: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఉద్యానాయక్ తండా పశు వైద్యాధికారి రాథోడ్ రమేశ్ బుధవారం 15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యానాయక్‌తండా పశువైద్య కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ జుగునాక మాధవ్‌రావు 6 నెలల క్రితం నార్నూర్‌కు బదిలీపై వెళ్లాడు. తనకు రావాల్సిన రెండు నెలల వేతనం మంజూరు చేయించాలని పశువైద్యాధికారికి విన్నవించగా లంచం డిమాండ్ చేశాడు. 15 వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రమేశ్ 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు.

## ‘ఎనుమాముల’ పాలకవర్గం నియామకం

*చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్ పటేల్*



*ఎర్ర ప్రియాంక, బండి జనార్దన్ పటేల్*

కాశీబుగ్గ, జనవరి29: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. 14 మంది సభ్యులతో పాటు నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 18 మంది ఉంటా రు. చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్‌పటేల్, సభ్యులుగా దుగ్యాల గోపాలరావు, గడరబోయిన రాజు, దానెకుల రాంబాబు, చల్లా వాసుదేవరెడ్డి, గొడుగు భిక్షపతి, బదావత్ నర్సింహా నాయక్, ఆకుల రుద్రప్రసాద్, బొడ్డు ప్రదీప్‌కుమార్, కత్తి సంపత్, మహ్మద్ సాబేరా, అచ్చ నాగరాజు, గజ్జెల శ్యాంసుదర్‌ను నియమించారు. అలాగే జిల్లా మార్కెటింగ్ అధికారి, ఖిలా వరంగల్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నగర మేయర్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతా రు. వీరి కాలపరిమితి రెండేళ్ల పాటు ఉంటుం ది. 2023 ఆగస్టు 16న గత పాలకవర్గం గడువు ముగియగా అప్పటి నుంచి నియమించలేదు. నూతన పాలకవర్గం నియామకం కావడంతో మార్కెట్‌లో వ్యాపారులు, రైతులు, వివిధ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## వర్గీకరణ అమలు చేయకుంటే దండోరా వేస్తాం

కాజీపేట, జనవరి 29 : సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను ఫిబ్రవరి 7లోగా అమలు చేయకుంటే హైదరాబాద్‌లో లక్షలాది డప్పులు-వేలాది గొంతులతో మాదిగ దండోరా వేస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ హెచ్చరించారు. కాజీపేట చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేణిగుంట్ల మహేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సందెల విజయ్, రాజారపు క్రాంతి, మాతంగి కిరణ్, మాచర్ల శేఖర్ పాల్గొన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

PUB/0083

**ప్రొఫార్మా 10-1**

**బహిరంగ ప్రకటన**

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

**సెక్షన్: సికింద్రాబాద్:** కాజీపేట్ -విజయవాడ సెక్షన్ మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్ నిర్మాణం- ప్రయాణీకుల పబ్లిక్ రవాణా కొరకు కి.మీ. 407.810 నుండి కి.మీ. 438.226 వరకు నెక్కొండ (NKD) మరియు మహబూబాబాద్ (MABD) స్టేషన్ల మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో నెక్కొండ మరియు మహబూబాబాద్ స్టేషన్ల OHE లొకేషన్ 407/C21 (km/Ch: 407/840.20m) నుండి 438/C10 (km/Ch: 438/435.70) వరకు నెక్కొండ (NKD) మరియు మహబూబాబాద్ (MABD) స్టేషన్ల మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్ 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: 15-02-2025న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

**ప్రొఫార్మా 10-2**

**(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)**

**ac 25kV ట్రాక్షన్ ప్రారంభం**

**‘‘రహదారి వినియోగదారులకు హెచ్చరిక’’**

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

**సెక్షన్: సికింద్రాబాద్:** కాజీపేట్ -విజయవాడ సెక్షన్ మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్ నిర్మాణం- ప్రయాణీకుల పబ్లిక్ రవాణా కొరకు కి.మీ. 407.810 నుండి కి.మీ. 438.226 వరకు నెక్కొండ (NKD) మరియు మహబూబాబాద్ (MABD) స్టేషన్ల మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో నెక్కొండ మరియు మహబూబాబాద్ స్టేషన్ల OHE లొకేషన్ 407/C21 (km/Ch: 407/840.20m) నుండి 438/C10 (km/Ch: 438/435.70) వరకు నెక్కొండ (NKD) మరియు మహబూబాబాద్ (MABD) స్టేషన్ల మధ్య విద్యుదీకరణతో కొత్త BG మూడవ లైన్, లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవల్‌కు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.**

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:

i) హైట్‌గేజ్‌కు ప్రమా దం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.

ii) వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.

iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A0108 **డిప్యూటి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, సికింద్రాబాద్**




*వరంగల్ అండర్‌బ్రిడ్జిలోని జక్రియా హోటల్*



*జక్రియా*

## ఎవరీ జక్రియా?

- **చెన్నైలో పట్టుబడిన జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడు**
- **వరంగల్‌వాసి కావడంతో దేశవ్యాప్తంగా కలకలం..**
- **నిఘావర్గాల ఆరా..**

సుబేదారి, జనవరి 29 : చెన్నైలో పట్టుబడిన జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడు జక్రియా వరంగల్‌వాసి కావడంతో రాష్ట్ర, దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అసలు జక్రియా ఎవరు? ఎందుకు చెన్నై పోలీసులకు పట్టుబడ్డాడు అనేది వరంగల్ నగరంలో చర్చనీయాంశంగా మారింది. నగరంలోని 17వ డివిజన్ జాన్‌పాక ఆదర్శనగర్ కాలనీకి చెందిన మహ్మద్ జక్రియా ముప్పై ఏళ్ల క్రితం గుంటూరు జిల్లా సిరిపురం నుంచి వరంగల్ నగరానికి వచ్చాడు. ఆదర్శనగర్‌లో నివాసం ఉంటూ వరంగల్ అండర్ బ్రిడ్జి వాల్‌మార్ట్ ప్రాంతంలో రెండు బిర్యానీ సెంటర్లు నడపుతున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు కాగా, జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడిగా పని చేస్తూ మత మార్పిడికి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈనెల 25న విజయవాడకు చెందిన ఇద్దరితో కలిసి శ్రీలంక వెళ్లడానికి రైల్లో చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు.అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. జక్రియా వరంగల్ వాసి కావడంతో ఇక్కడ అతడి వ్యవహారాలపై కేంద్ర, రాష్ట్ర పోలీసు నిఘావర్గాలు దర్యాప్తు ప్రారంభించాయి. బుధవారం వరంగల్ పోలీసు కమిషనరేట్ ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, స్థానిక గీసుగొండ పోలీసులు జక్రియ నివాస ప్రాంతమైన జాన్‌పాక, అలాగే అతడు వరంగల్‌లో నిర్వహిస్తున్న బిర్యానీ సెంటర్ల వద్ద ఆరా తీసినట్లు సమాచారం.

**సెంట్రల్ నిఘా వర్గాలు ఆరా..**

జక్రియా జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడిగా పని చేస్తూ మత మార్పిడికి పాల్పడుతున్నట్లు చెన్నై పోలీసులు విచారణలో తేలడంతో అతడికి సంస్థతో ఉన్న సంబంధాలు ఏమిటి ? దీని వెనుక శత్రు దేశాల మూలాలు ఉన్నాయా? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కాగా జక్రియా వరంగల్ వాసి కావడంతో స్థానిక పోలీసు నిఘావర్గాలు కూడా వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. జక్రియాకు వరంగల్‌లో ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి. ఆ సంస్థలో ఇక్కడ ఎవరెవరు పనిచేస్తున్నారు? జక్రియ జమాతే ఇస్లామీ సంస్థ ప్రతినిధిగా ఎంతకాలం పనిచేస్తున్నాడు? ఇంతకుముందుకు దేశంలోని ఎక్కడెక్కడ తిరిగాడు?, బయటి దేశాలకు వెళ్లాడా అనే కోణాల్లో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా జక్రియాకు సంబంధించిన హోటళ్లను పోలీసులు మూసివేయించారు.

## మొగుళ్ల చెరువులో విష ప్రయోగం

*విచారణ జరిపిన ఓరుగల్లు వైల్డ్ లైఫ్ బృందం*

శాయంపేట, జనవరి 29 : మండలంలోని పత్తిపాక శివారులోని మొగుళ్ల చెరువులో వేటగాళ్లు విషప్రయోగం చేసినట్లు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యదర్శి చెల్పూరి శ్యామ్‌సుందర్ శర్మ, జాయింట్ సెక్రటరీ పిట్టల రవిబాబు, సభ్యుడు మారపల్లి సునీల్‌తో కలిసి ఆయన చెరువును సందర్శించి విచారణ చేపట్టారు. మొగుళ్ల చెరువులో వలస పక్షుల మాంసం కోసం విష ప్రయోగం జరిగిందని తేల్చారు. గుర్తు తెలియని వేటగాళ్లు పక్షులను చంపేందుకు విష గుళికలను చెరువులో వదిలినట్లు తెలిపారు. దీంతో రెండు రోజుల క్రితం పక్షులు మృతి చెందినట్లు తెలిపారు. వాటి అవశేషాలు, సాక్ష్యాలను సేకరించినట్లు చెప్పారు. విష ప్రయోగం చేసి వలస పక్షులను చంపుతున్న వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఇంటి ముందు గిరక తాడు

**ఇగ మండువకు పోయేది లేదు**

దేవరుప్పుల, జనవరి 29: మండలంలోని కామారెడ్డిగూడెంలో కోతి సత్తయ్య ఇంటి ముందే గిరక తాడు గీతకు రాగా పొద్దూమాపూ కల్లు గీస్తున్నాడు. తాటి చెట్టు ఎక్కే అవసరం లేకుండా కర్రలతో మంచె ఏర్పాటుచేసి దాని మీద ఎక్కి కల్లు గీస్తున్నాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరా వు ఈ గిరక తాటి చెట్లను ప్రత్యేకంగా ఆంధ్రా నుంచి తెప్పించి గ్రామాల్లో ఉచితంగా అందజేశా రు. 9 ఏండ్ల క్రితం నాటిన ఈ చెట్టు కల్లు పార డంతో గత ఐదు రోజులుగా కల్లు గీస్తున్నట్లు ఇంటి యజమాని సత్తయ్య తెలిపారు. ప్రస్తుతం ఐదు సీసాల కల్లు అవుతున్నట్లు పేర్కొన్నారు.



*గిరక తాడు కల్లు గీస్తున్న కోతి సత్తయ్య*

## కమ్యూనిస్టులను అంతం చేయడం ఎవరి తరం కాదు

- **సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**

హనుమకొండ, జనవరి 29: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలనే దురాలోచన చేస్తున్నదని, అది ఎవరి తరం కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సీపీఐ వందేళ్ల వార్షికోత్సవాల సందర్భంగా బుధవారం హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ వందేళ్ల వార్షికోత్సవ సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సభకు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, నక్సలైట్లు మా సహచర సోదరులేనని, వారిని చంపడం దుర్మార్గమైన చర్యని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్లను ఆపాలని డిమాండ్ చేశారు. మతతత్వ రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. గద్దర్‌కు అవార్డు ఇవ్వ డం తప్పనడం అంతకన్నా మూ ర్ఖత్వం లేదని, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలను స న్మా నించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యద ర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయి న కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, పంజాల రమేశ్, జిల్లా సహా య కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, ఉట్కూరి రాములు,నకీర్త ఓదె లు, మోతె లింగారెడ్డి, గోలి రాజిరెడ్డి, యేషబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ శ్రేణులు





